
# ఎవరో...! ఎవరో...!!

యెలిశెట్టి శంకరరావు




"ఎక్స్‌క్యూజ్ మీ లేడీస్ అండ్. జంటిల్‌మెన్! సారీ ఫర్ ద డిస్టర్బెన్స్! నేను ఈ కథా రచయితని కమ్ నిరుద్యోగి గ్రాడ్యుయేట్‌ని. నిన్న సాయంత్రం సముద్రపు టొడ్డున నా అపూర్వమైన అనుభవం మీకు చెబుతాను.

అందమైన సాయంత్రం వేళలు మెత్తని ఇసుకలో కూర్చుని ఉవ్వెత్తున లేచి పడే కెరటాల్ని చూస్తూ, సముద్ర ఘోషని వింటూ పరవశించటం, ఆ పరవశంలో గంటలు తరబడి గడపటం అలవాటు. అయితే నిన్న సాయంత్రం సముద్రపు టొడ్డున నేను నడుస్తుండగా సముద్రపు ఘోష హఠాత్తుగా వినపడడం మానేసింది.

నేను ఆశ్చర్య పోయాను.

చటుక్కున స్ఫురించింది.

సముద్రపు ఘోషను మించిన రోదన మరేదో వినిపిస్తూంది. హృదయవిదారకంగా ఎవరో స్త్రీ రోదిస్తూంది. అందుకే సముద్రపు ఘోష వినబడటం లేదు. ఎవరా స్త్రీ? ఎందుకు విలపిస్తూంది ?

చుట్టూ చూశాను.

దూరంగా ఎర్ర మట్టి దిబ్బల

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

# తెల్లమచ్చలకు చికిత్స



తెల్లమచ్చలు నయంకాని వేమీ కాదు. సకాలంలో సరైన చికిత్స చేస్తే మిగిలిన జబ్బులలాగే ఇది కూడ నయంచేయొచ్చు. మా నిరంతర పరిశోధనల ఫలితంగా తెల్లమచ్చ (బొల్లి)ను నయం చేయటంలో మేము



విజయం సాధించాం. ఈ మందు ఎంత శక్తివంతమైందంటే ఎంత వేగంగా తగ్గిస్తుందంటే—ఉపయోగించిన వెంటనే చర్మం రంగు మారటం ప్రారంభిస్తుంది, కురుళ్ళను నాశనం చేస్తుంది. మరియు చర్మం యొక్క సహజ రంగును త్వరగా పునరుద్ధరిస్తుంది. ఇతర వైద్యులతో మీరు విసిగిపోయి వుంటే మా మందును ఒక్కసారి వాడినంతనే మీకు తృప్తి కలుగుతుంది. మీ జబ్బును గురించిన పూర్తి వివరాలు వ్రాసి మా ఉచిత సలహాను అడగండి:-

ఈ వైద్యం కోసం మందును ఎవరైనా చేయవచ్చును.
విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి.

**SRI AYURVEDIC PHARMACY (Regd.)**
**P.O. KATRI SARAI (GAYA)**



**CHOICE**



శబ్ద-దృశ్య
పరికరాలలో
ఒక గొప్ప పేరు



మీకు ఇష్టమైన ఫిల్మ్ స్టార్‌ని గుర్తించండి.
ఇదిగో "ఛాయిస్" సంస్థ వారి నుంచి మీకు అతి తేలికయిన పోటీ.
మీరు చేయవలసిందల్లా తెలుగు ఫిల్ములలో అత్యంత ప్రజాదరణ గల ఫిల్మ్ స్టార్ పేరు చెప్పడమే.
మొదటి బహుమతి విజేతకు 10 కేసెట్‌లు, రెండవ బహుమతి విజేతకు 6 కేసెట్‌లు, 3వ బహుమతి విజేతకు 4 కేసెట్‌లు లభిస్తాయి. డ్రా ద్వారా బహుమతులు యిస్తారు.
నిర్వాహణదారుల నిర్ణయం తుది నిర్ణయం.
మీ ఎంట్రీలను. ప్రకటన వెలువడిన 20 రోజులలోగా పంపించండి.

**CHOICE INDIA, (TL-I) P.B. 4514, DELHI-110016**
**Most Popular Film Star Male/Female ______/______**
**Name. Address.**
**Pin Code.**


కనతలగా వో స్త్రీ మూర్తి కనిపించింది.

వడివడిగా అటు నడిచాను.

రోదిస్తూ రెండు చేతులు నెత్తిన వేసుకునుందో వృద్ధురాలు. ఆవిణ్ణి ఎక్కడో చూసి నట్టనిపించింది నాకు. ఎవరు? ఊహు గుర్తు రాలేదు. పరకాయించి ఆమె వైపు చూశాను.

ఆమె మొహం దైన్యంగా, కళ్ళు విస్తృతంగా ఉన్నాయి. ఆ వృద్ధురాలి ముందు మరో ఇద్ద రమ్మాయిలుకూడా ఉన్నారు. తెల్లగా, బొద్దుగా ఖరీదైన పట్టు చీరతో ఉంటుందో అమ్మాయి. నల్లగాచేనేతచీరలోఉంటుందోఅమ్మాయి. ఇద్దరి మొహాలు కళ తప్పి ఉన్నాయి. ఇద్దరూ ఏదో చెబుతున్నారు. వాళ్ళు చెప్పింది వింటూ మధ్య మధ్య దుఃఖాన్ని ఆపుకోలేక రోదిస్తూంది. ఆ రోదన హృదయాన్ని కెలికేసేలా ఉంది.

నేను నెమ్మదిగా వాళ్ళని సమీపించి వాళ్ళ చేరువలో నిలుచుని వాళ్ళ సంభాషణ వినసాగాను.

నల్లగా ఉన్న అమ్మాయి దీనంగా అడుగుతూంది— 'అమ్మా! నువ్వు నా కన్నతల్లివి కాకపోవచ్చు. నీ మాట వినక నేను దారి తప్పిన దాన్నే కావచ్చు. అంతమాత్రాన నేను నీ కూతుర్ని కానా, అమ్మా?

ఆప్యాయంగా ఆ అమ్మాయిని తన ఒడిలోకి తీసుకుని కరుణగా ఆమె శిరస్సుని స్పృశించింది వృద్ధురాలు.

'ఎవరన్నారమ్మా? నువ్వు నా కన్న కూతురివి కాకపోయినా అంతకంటే ఎక్కువేగా?' సానునయంగా పలికింది వృద్ధురాలి స్వరం.

'తన తాగుబోతు స్నేహితుల ముందు నన్ను వీనస్‌లా నిలబెట్టి తన మగతనాన్ని ప్రదర్శించుకుంటున్నాడు నీ కొడుకు. తప్పు కదా ఇదేమిటయ్యా ఈ ఘోరం! అని నేను గుండె పగిలేలా ఏడుస్తూ అడిగితే 'తప్పొప్పులు చెప్తోంది కులట. వినండోయ్' అంటూ విరగబడినవ్వుతున్నాడమ్మా నీ కొడుకు.' చెబుతూ క్షణం ఆగి మళ్ళీ అంది ఆ అమ్మాయి.

'నిన్న నేను ఒళ్ళమ్ముకుని కడుపు నింపుకోవటానికి పాతిక రూపాయలు సంపాదించుకుంటే అవిలాక్కుని విస్కీతో వాడి కడుపు నింపుకున్నాడమ్మా!' హృదయవిదారకంగా చెప్పిందాఅమ్మాయి.

ఆశ్చర్యంగా చూస్తూన్నాను నేను.

శిలాప్రతిమలా ఉండి పోయింది వృద్ధురాలు.

నెమ్మదిగా చెప్ప నారంభించింది తెల్లగా ఉన్న అమ్మాయి.

"మీకు తెలియదా, అత్తయ్యా! మాది పేద కుటుంబం. పేద బడిపంతులు ఉద్యోగంలో ఎలాగో అతి కష్టం మీద పది వేలు అప్పు చేసి మీ అబ్బాయికి కట్న మిచ్చి నా పెళ్ళి చేశాడు మా నాన్న. అల్లుడు యోగ్యుడు. నా కూతురు సుఖపడు తుందని సంబర పడ్డారు. మీ అబ్బాయి నన్ను చూసి విసుక్కుంటున్నా డిప్పుడు. నేను తన పాలిట దరిద్రాన్నట. నన్ను గాకుండా మరెవర్నయినా చేసుకున్నట్టయితే లక్షో, రెండు లక్షలో కట్నం వచ్చేదిట. తను మోటారు సైకిలు కొనుక్కోవటానికైనా మా పుట్టింటికి వెళ్ళి డబ్బు తీసుకు రమ్మంటున్నారు. నేను ఏం చెయ్యాలి. నా తరవాత ఇంకా నాన్నకి నలుగురు పెళ్ళి కెదిగినఆడపిల్ల లున్నారు. వాళ్ళ పెళ్ళిళ్ళ సంగతలా ఉంచి వాళ్ళకి సరిగ్గా తిండి పెట్టలేక పోతున్నాడు నాన్న. నే నే మొహం పెట్టుకుని వెళ్ళి నాన్నని డబ్బడగ్గలను?

నేను మవునంగా ఉండిపోతుంటే మీ అబ్బాయి పట్టుదల, విసుగు ఎక్కువవుతున్నాయి. చదువుకున్న వాడై కనీస సంస్కారం కూడా లేకుండా నోరు విప్పి చెప్పుకోవటాని క్కూడా సిగ్గు పడే చోట్ల సిగరెట్టుతో కాల్చి చురకలు పెడుతున్నారు." బాధ, సిగ్గు మిళితమైన స్వరంతో చెప్పిన ఆ అమ్మాయి తల వాలిపోయింది. కన్నీళ్ళు బుగ్గల మీదుగా జారి పడుతున్నాయి.

సమస్తం పోగొట్టుకున్న దానిలా నిర్వికారంగా శూన్యం లోకి చూస్తూ ఉండిపోయిం దా వృద్ధురాలు.

చాలా సేపయిం తరవాత ఇద్ద రమ్మాయిల వైపు చూసి అంది—

"వాడిలా ఎందుకు తయారయ్యాడో నేను కనుక్కుంటాను. మీరు వెళ్ళి నా పెద్ద కొడుకుని తీసుకు రండి."

అమ్మాయిలిద్దరూ వడివడిగా వెళ్ళారు.

నా కిదంతా,వింతగా అయోమయంగా ఉంది.

వీళ్ళందరూ ఎవరు? ఈ వృద్ధురాలెవరు? ఈవిణ్ణి ఎక్కడో చూసి నట్టుందే? ఎక్కడ? ఎవరై ఉంటారు? శాడిస్టు లాంటి ఈవిడ కొడు కెవరు? అతని అన్న ఎవరు?

నేను ఆలోచనల్లో మునిగి ఉండగానే ఆ అమ్మాయి లిద్దరూ ఒక యాభై యేళ్ళ వయసున్నతన్ని వెంట బెట్టుకొచ్చారు. అతని మొహం కాంతిగా, శాంతిగా ఉంది.

అతన్ని చూడగానే నా ఆలోచనలు చెదిరిపోయాయి.

"నమస్కారం, అమ్మా!" వచ్చినతను వృద్ధురాలికి నమస్కరించాడు.

ఎర్రబారిన వృద్ధురాలి కళ్ళు అతన్ని కోపంగా చూశాయి.

"ఏరా? నీ తమ్ముడు అమాయకుల్ని పీడించి, లంచాలు తీసుకుని 'తాగితందనా లాడుతున్నాడట నిజమేనా?' కర్కశంగా అడిగింది వృద్ధురాలు.

సిగ్గుతో తల దించుకుని నిజమే నన్నట్లు తలూపా డతను.

"మరి వా డలా అవినీతి మార్గంలో పయనిస్తుంటే నువ్వు మందలించలేదా?" గద్దించి అడిగిం దావె.

"ఎలా మందలించ గలనమ్మా! అధికారం వాడి కళ్ళు కప్పేసింది. నేను మందలిస్తే నా ఒక్కడిదేనా తప్పు? అవినీతి, లంచగొండితనం దేశమంతటా అల్లుకుపోయాయి. నే నొక్కన్నే ప్రిన్సిపుల్డ్‌గా ఎందుకుండాలని ఎదురు ప్రశ్న వేస్తున్నాడమ్మా వాడు!" నెమ్మదిగా చెప్పా డతను.

"లంచగొండితనం దేశంలో అంతగా ప్రబలిపోయిందా?" ప్రశ్నించిం దావె.

"ఆ! పశువులు ఎంత ఆనందంగా గడ్డి తింటాయో, పందులు ఎంత ఆబగా అశుద్ధం తింటాయో మనుషులు అంత ఆనందంగా లంచాలు తింటున్నారమ్మా. ఏ ఒక్కరిద్దరైనా హానెస్ట్‌గా, ప్రిన్సిపుల్డ్‌గా ఉండాలనుకుంటే వాళ్ళ బ్రతుకుల్ని పరిహసించి చేతకాని వాళ్ళంటుం దమ్మా సంఘం. బాధగా జవాబిచ్చా డతను.

"నిక్కృష్టుల సంగతి కాదు నేను మాట్లాడుతుంది. నా కొడుకు సంగతి నేను అడుగుతున్నాను. ఈజీవుని ముష్టి కట్నంకోసం బహుమతులకోసం ధర్మార్థ కామమోక్షాలందు నీతో ఉంటానని ప్రమాణం చేసి కర గ్రహణం చేసిన భార్యని హింసించే శాడిస్టుని నా కొడుకని ఎలా చెప్పుకోన్రా! సంఘాన్ని ఉద్ధరిస్తాడని ఆశగా లాలించి పెద్దచేసి సబ్ఇన్స్పెక్టర్ని చేస్తే నా కొడుకు విద్యుక్త ధర్మాన్ని విస్మరించి ఆఖరికి వో పథవిహీన దగ్గర కూడా లంచం తీసుకుని మధువు మైకంలో కాని పని చేస్తున్నాడా? ఆ పథవిహీన వరసకు తన చెల్లెలే అవుతుందనే ఇంగితజ్ఞానం కూడా వాడిలో నశించి పోయిందా? నా కొడుకు ఇలా దుర్భాగ్యుడిలా తయారయ్యా డెందుకురా?" ఆక్రోశిస్తూ అడిగింది వృద్ధురాలు.

"పర్వెర్షన్. యూత్ పర్వెర్షన్. జీవితాన్ని జీవితంలా అనుభవించటం ఆనందించటం చేతకానితనం, ధైర్యంగా వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కోలేని మానసిక బలహీనత పీడిచేత కానిపన్లు చేయిస్తున్నాయి. అవినీతి అంధకారం లోకి వాడికి తెలియకుండానే వాడిని లాగేస్తోంది ఈ పర్వెర్షన్. మధువు లోనూ, మార్ఫియాలోనూ ఆనందాన్ని వెతుక్కునే పిచ్చి ప్రయత్నంలో వాడు పశువై పోతున్నాడు. పశుత్వం వాడ్ని కమ్మిన క్షణాన ఆ తన వాళ్ళనే తాను హింసిస్తున్నాననే విచక్షణాజ్ఞానం వాడిలో నశిస్తోంది. ఆ బలహీన క్షణంలో చెల్లి, భార్య అందర్నీ హింసిస్తున్నాడు వాడు." బాధగా కణతలు రుద్దుకుంటూ చెప్పా డతను.

వృద్ధురాలి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"కనీసం మిగతా పిల్లలకయినా మామూలుచదువుతోపాటుఉన్నతసంస్కారంనేర్పించుబాబు. విద్య అంతిమలక్ష్యం మనో నేత్రాన్ని కాంతిపథం వైపు మళ్ళించటం అనే సూక్తిని వాళ్ళకి అర్థమయ్యేలా విడమర్చి చెప్పు ..."

తల్లిచెప్తుంటే మౌనంగా వింటున్నా డతను.

క్షణం ఆగి తిరిగి చెప్పింది వృద్ధురాలు.

"నీ తమ్ముడితో చెప్పు. ఆడదాన్ని హింసించి ఆనందించే నీ నీచ ప్రవృత్తికి నీ తల్లి ఆక్రోసిస్తోందని చెప్పు. ఆడదాన్ని అవమానించి కాలరాచే నీ వికృత స్వభావానికి కుమిలిపోతూ నీలాంటి శాడిస్టుని కని దేశానికి తీరని అన్యాయం చేశానేమో ననే బాధతో అనుక్షణం మానసికక్షోభ ననుభవిస్తోందని చెప్పు. కన్నతల్లి కడుపులో చెయ్యిపెట్టి కెలకొద్దని అమ్మ నిన్ను వేడుకొందని దీనంగా వాడికి మనసుంటే అది కరిగేలా చెప్పు. హృదయ విదారకంగా రోదిస్తూ అంది వృద్ధురాలు.

"తప్పకుండా చెప్తానమ్మా. ఆ పైన వాడిష్టం" నెమ్మదిగా పలికి వెనుదిరిగి ముందుకి సాగిపోతున్న అతన్నిచూస్తుంటే అతను, ఆ వృద్ధురాలు వాళ్ళంతా ఎవరో నాకు హఠాత్తుగా గుర్తొచ్చేశారు.

గత నాలుగేళ్ళుగా ఉద్యోగంకోసం పిచ్చివాడిలా తిరుగుతూ వాళ్ళని మర్చిపోయాను. ఎవరో, ఎవరో అనుకున్నాను.

ఆ వెళ్ళిపోతున్నతను ఛాన్సలర్.

వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ వృద్ధురాలు మా అమ్మ!

మా అమ్మ పేరు!

"ఆంధ్రా యూనివర్శిటీ" !✸

